క్లుప్తంగా

విజ్ఞాన యాత్రతో మేధోశక్తి



కార్ల షోరూంను సందర్శిస్తున్న విద్యార్థులు

ఎస్.రాయవరం: విజ్ఞాన యాత్ర ద్వారా విద్యార్థుల్లో తార్కిక, ఆలోచన, మేధో శక్తులు పెంపొందుతాయని దార్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమణశ్రీ తెలిపారు. పరిశ్రమల పరిచయ వేదికలో భాగంగా నర్సీపట్నం కార్ల షోరూం, వర్క్‌షాప్‌ను మంగళవారం విద్యార్థులు సందర్శించారు. పనుల జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో ఉపాధి కల్పనకు ఇటువంటి యాత్రలు దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీదేవి, పీడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న సింహాచలం, గణేష్ కుటుంబ సభ్యులు

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డును ఆనుకుని తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. మంగళవారం మునగపాకకు చెందిన టెక్కలి సింహాచలం, గణేష్ కుటుంబ సభ్యులు రూ.1,03,699 నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, మళ్ల సంజీవరావు, మొల్లేటి సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహనరావు, బొడ్డేడ రామునాయుడు, దాడి ముసిలినాయుడు, ఆడారి కాశీబాబు, విల్లూరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌరశాస్త్రం బోధించడం కోసం అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 50 శాతం ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పూర్తి వివరాలకు 99511 39378 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

'ఉప్పుటేరులో నీటి శాంపిల్స్ సేకరణ'

అచ్యుతాపురం: ఉప్పుటేరులో కలుషితం అవుతున్న నీటి శాంపిల్స్‌ను కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సేకరించారని పూడిమడక జనసేన నాయకులు తెలిపారు. ఇటీవల కాలంలో ఉప్పుటేరులో చేపలు మృత్యువాత పడుతున్న విషయాన్ని ఏపీపీసీబీ జోనల్ కార్యాలయ అధికారులకు తెలియజేశామని, శాంపిల్స్ నివేదిక వచ్చిన తర్వాత ఏ కంపెనీల నుంచి కలుషిత రసాయనాలు వస్తున్నాయో నిర్ధారించి చర్యలు తీసుకుంటామని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలిపారని వారు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఉప్పుటేరులో కలుషిత నీరు కలిస్తే ఆందోళన చేపడతామన్నారు. ఈ మేరకు మంగళవారం వారు ఉప్పుటేరుని పరిశీలించారు. ఈ ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరాడ ధనరాజ్, ధోని, చంటి, ఎరిపల్లి దేవుడు, బోడిపల్లి గంగరాజు, చిన్న, సత్తిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న వైద్యాధికారి శక్తిప్రియ

ఎస్.రాయవరం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. ఆశా డే సందర్భంగా పీహెచ్‌సీలో మంగవారం ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించి ఆరోగ్య సూత్రాలు చెప్పాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
7331100207, 7997958344



ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఆయిల్‌పామ్ గెలలు





ఆయిల్‌పామ్ తోట

లాభాలు బాగు.. ఆయిల్‌పామ్ సాగు

ఆరు నెలలుగా పెరుగుతున్న ధరలు ● ఆర్థిక భరోసాతో రైతుల్లో నూతనోత్సాహం

కోటవురట్ల: ఆయిల్‌పామ్ సాగు రైతులను ఆదుకుంటోంది. పెరుగుతున్న ధర రైతుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఒక్కసారి పెట్టుబడి పెడితే ఆపై ప్రతి నెలా కచ్చితమైన ఆదాయంతో రైతులు ఆర్థిక ఆసరా పొందుతున్నారు. చీకూ చింతా లేకుండా ఆర్థిక భరోసాతో కుటుంబాన్ని పోషించుకునే అవకాశం కలుగుతోంది. ఉద్యానవన శాఖ అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలతో పాటు మెండుగా వస్తున్న లాభాలతో ఏటా సాగు విస్తీర్ణం పెరుగుతూ వస్తోంది. గత ఆరు నెలలుగా ధర పెరుగుతూ వస్తుండగా, రెండు నెలలుగా ఊహకందని విధంగా పెరుగుతున్న ధర రైతులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

ఆయిల్‌పామ్ గెలల ఎగుమతికి రైతులకు బెంగలేదు. ఎక్కడికక్కడ కొనుగోలు కేంద్రాలు ఉండడంతో రైతులకు రవాణా ఖర్చుల భారం లేకుండా పోయింది. కోటవురట్ల మండలంలో చినలింగాపురంలోను, చిన బొడ్డేపల్లిలోను కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి. ఈ పరిస్థితులకు తోడు ఉద్యానవన శాఖ ద్వారా వలు రాయితీలు అందుతున్నాయి. మొక్కలను ఉచితంగా ఇస్తూ నిర్వహణ ఖర్చుగా నాలుగేళ్ల పాటు ఏడాదికి ఒక హెక్టారుకు రూ.5250 చెల్లిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు మంజూరు చేస్తున్నారు.

ఇటీవల పెరిగిన ధరలు ఇలా..	నెల	మే	జూన్	జూలై	ఆగస్టు	సెప్టెంబర్	అక్టోబర్
	టన్ను ధర(రూ.లలో..)	13,280	13,500	13,740	13,950	16,930	19,050

పెరుగుతున్న విస్తీర్ణం

లాభాలు బాగా వస్తుండడంతో పలువురు రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు అడుగులు వేస్తున్నారు. ఒక్కసారి మొక్క నాటాక జీవితాంతం స్థిరమైన ఆదాయం వస్తుండడంతో మిగతా పంటలకు స్వస్తి పలికి ఆయిల్‌పామ్ సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆయిల్‌పామ్ సుమారు 7,500 హెక్టార్లలో సాగులో ఉంది. పాయకరావుపేట నియోజకవర్గంలో 990 హెక్టార్లలో సాగులో ఉండగా.. కోటవురట్ల మండలంలో అత్యధికంగా 670 హెక్టార్లు, ఎస్.రాయవరం మండలంలో 145 హెక్టార్లు, పాయకరావుపేట మండలంలో 130 హెక్టార్లు, నక్కపల్లి మండలంలో 45 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు ఉన్నాయి.

లాభాలు బాగున్నాయి..



ఆయిల్‌పామ్ సాగులో మంచి లాభాలు వస్తున్నాయి. గతంతో కంటే ఇప్పుడు పరిస్థితి మెరుగ్గా ఉంది. ప్రతి నెలా కచ్చితమైన ఆదాయం వస్తోంది. రెండు నెలలుగా మంచి ధర పలుకుతోంది. ఇవే లాభాలు కొనసాగితే రైతుకు కొండంత భరోసా ఉన్నట్టే. – కిల్లాడ శ్రీనివాసరావు, రైతు, పాములవాక

అన్ని విధాలా ప్రోత్సాహం..



ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం ఇస్తున్నారు. మొక్కలను ఉచితంగా ఇవ్వడంతో పాటు నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చుగా ఏటా హెక్టారుకు రూ.5250 చొప్పున ఇస్తున్నారు. ఐదెకరాల లోపు రైతులకు 90 శాతం, ఐదెకరాలు దాటిన రైతులకు 50 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తున్నారు. – అజయ్, ఫీల్డ్ ఆఫీసర్, రుచిసోయా ఆయిల్ పామ్ కంపెనీ

ప్రోత్సాహకాలు ఇస్తున్నారు..



ఆయిల్‌పామ్ సాగుకు ఉద్యానవన శాఖ ద్వారా ప్రోత్సాహం లభిస్తోంది. మొక్కలను ఉచితంగా ఇవ్వడంతో పాటు నాలుగేళ్ల పాటు నిర్వహణ ఖర్చుగా కొంత నగదు ఇస్తున్నారు. డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రాయితీపై ఇస్తున్నారు. ప్రస్తుత ధర బాగుంది. – సిద్ధాబత్తుల బాబ్జీ, రైతు, కైలాసపట్నం

పూడిమడకలో దివ్యాంగుల నిరసన



పూడిమడకలో నిరసన తెలుపుతున్న దివ్యాంగుల యూనియన్ సభ్యులు

అచ్యుతాపురం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్యుతాపురం మండలం పూడిమడకలో స్వామి వివేకానంద దివ్యాంగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 2016 దివ్యాంగుల చట్టం అమలు కావడం లేదని అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు నూకరాజు ఆరోపించారు. దివ్యాంగులకు రుణాలు మంజూరు చేసినప్పుడు ప్రభుత్వ ఉద్యోగుల షూరిటీ అడుతున్నారని, ఇది తగదన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో కూడా దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కంబాల రాము, గంధవరపు రాజు, గంగిరి ధనలక్ష్మి, కామేశ్వరి, మేరుగు సన్యాసిరావు, ఆనందరావు, మంగరాజు, వాడ తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరోధక విభాగం ఇన్‌చార్జిగా జగ్గప్పారావు



బొడ్డేడ జగ్గప్పారావు

మునగపాక: అవినీతి నిరోధక విభాగం యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా వినియోగదారుల ఉద్యమ కర్త బొడ్డేడ జగ్గప్పారావు నియమితులయ్యారు. ఈ మేరకు ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రంగసాయిరెడ్డి నుంచి నియామక పత్రం అందుకున్నట్టు జగ్గప్పారావు తెలిపారు. తనకు అవకాశం కల్పించిన రంగసాయిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అన్ని రంగాల్లోనూ విభిన్న ప్రతిభావంతులు రాణింపు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వాతిభవానీ



భవిత కేంద్రంలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న న్యాయమూర్తి స్వాతి భవానీ

యలమంచిలి రూరల్: ప్రస్తుతం దివ్యాంగులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని యలమంచిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతిభవానీ అన్నారు. విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. విభిన్న ప్రతిభావంతులను అందరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ జనాభాలో 8 శాతం మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో కల్పించిన రిజర్వేషన్‌ను సద్వియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ద్వారపురెడ్డి వెంకట్రావు, న్యాయవాదులు బి.హరిశంకర్రావు, టీవీ రమణ, ఎంఈవో మీనాక్షి, ప్రధానోపాధ్యాయురాలు భవానీ, పీఈటీ మూర్తి, వనుం నాగేశ్వర్రావు, అనురాధ, కోటి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



పూజలందుకున్న శాంభవి అమ్మవారు

ఎస్.రాయవరం: వమ్మవరం శాంభవి అమ్మవారి బోనాల ఊరేగింపు మంగళవారం ఘనంగా జరిగింది. మార్గమాసం మొదటి మంగళవారం అమ్మవారికి ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 200 మంది మహిళలు బోనాలు పట్టుకోగా.. 1000 మందికి పైగా మహిళలు వెన్నంట నడిచి వరాహనది ఒడ్డున ఉన్న అమ్మవారి గుడికి ఊరేగింపుగా తరలివెళ్లారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. శాంభవి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు సమర్పించారు.



బోనాలు ఊరేగింపులో భక్తులు

ఉపాధి పనుల్లో అక్రమాలపై విచారణ



పల్లపు ఆనందపురంలో విచారణ చేపడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అక్రమాలపై అందిన ఫిర్యాదులో భాగంగా మంగళవారం ఎంపీడీవో ఎం.ఉషారాణి విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారికి సంబంధించిన మస్తర్లు, ఉద్యోగాలు చేస్తున్న వారి పేరిట అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ అందిన ఫిర్యాదులో భాగంగా రెండు వర్గాల నుంచి వివరాలు సేకరించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలతో పాటు ఇతరుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని ఉపాధి హామీ పథకం ఏపీవో శివను ఎంపీడీవో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు



సన్మాన సభలో మాట్లాడుతున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు ఉంటుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మండలంలోని గణపర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవీ విరమణ చేసిన ఆంగ్ల భాష ఉపాధ్యాయుడు వంకలగౌరీ వెంకట త్రినాథరావును మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందని, అటువంటి వృత్తికి వన్నె తెచ్చిన త్రినాథరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఆది మహేశ్వరరావు, ఎంఈవో–2 శివనాయుడు, సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు, పెద్దలు రామనాగేశ్వరరావు, మారిశెట్టి వెంకటరమణ, కాండ్రేగుల చంద్రమోహన్, పీఎంసీ చైర్మన్ కాండ్రేగుల వెంకటరావు, చూచుకొండ ఎంపీటీసీ కాండ్రేగుల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: మండలంలోని గ్రామాలు అభివృద్ధే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో జయప్రకాష్‌రావు అన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులపై ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు అభివృద్ధి చెందాలని, పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణ పంచాయతీ అసెస్మెంట్స్ త్వరితగతిన పూర్తి చేయాలని, గ్రామాల్లో అభివృద్ధికి సంబంధించిన అంశాలు, చేయవలసిన పనులపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో ఈవో ఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, పంచాయతీ రాజ్ గృహ నిర్మాణ శాఖ, ఎస్ఆర్ఈజీఎస్ అధికారులు, ఆయా గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి



కోటవురట్లలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈవోలు



మునగపాక భవిత కేంద్రంలో బహుమతులు అందిస్తున్న ఎంఈవో వేణుగోపాలరావు



గొడిచర్ల హైస్కూల్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈవోలు, ఉపాధ్యాయులు

కోటవురట్ల: దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేలా వ్యవహరించాలని ఎంఈవో రామారావు, శ్రీజోష్ కోరారు. స్థానిక భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఓ ప్రత్యేకత ఉంటుందని, దానిని గుర్తించి ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. భవిత కేంద్రాల ద్వారా పిల్లల్లో మనోవికాసానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.లక్ష్మి, ఉపాధ్యాయులు బాల ముఖేష్, శిరీష, రమణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రత్యేక అవసరాల పిల్లల పట్ల ప్రేమానురాగాలు చూపాలని ఎంఈవో డి.వేణుగోపాలరావు కోరారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. తల్లితండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇటీవల నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన కృష్ణ చైతన్య, ఇల్లపు వెంకటరావు, శిరీషా బహుమతులు అందజేశారు. ఐఈఆర్‌టీలు సునీత, విజయేశ్వర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, సీఆర్పీలు లక్ష్మీనారాయణ, నూకేష్, తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు

నక్కపల్లి: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. గొడిచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఇటీవల వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ షేక్ యాస్మిన్, హెచ్ఎం అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: ప్రత్యేక అవసరాల పిల్లలు మానసిక స్థైర్యం కోల్పోకుండా పట్టుదలతో ఎన్నో విజయాలు సాధిస్తున్నారని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో పీఎస్‌టీ పట్నాయక్ ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ మాట్లాడుతూ వికలాంగులను ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందని తెలిపారు. నీరుకొండ నర్సింగరావు, చొప్పా తాతారావు, సారిపల్లి రమణ అప్పారావు, పంచదార్ల ప్రభాకర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

మునగపాక: ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని గణపర్తి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామంలో ప్రభుత్వ భూములకు సంబంధించి సర్వే వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించినట్లయితే అటువంటి వారి వివరాలు సేకరించాలన్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. డీటీ పడాల్, రెవెన్యూ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మునగపాక: మండలంలోని చూచుకొండలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కశింకోట మండలం సోమవరం గ్రామానికి చెందిన పితాని శివ మునగపాక మండలం చూచుకొండలో మంగళవారం అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో శివ నుంచి 16 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పంటల బీమాతో రైతులకు మేలు

కోటవురట్ల: రైతులు రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి సరోజిని కోరారు. సుంకపూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ అపరాల పంటలైన మినుములు, పెసర పంటలకు ఎకరాకు రూ.300 బీమా చేయించుకుంటే పంట నష్టపోతే పరిహారంగా బీమ నగదు రూ.20,000 వస్తుందని తెలిపారు. ఈ బీమాను ఈ నెల 15వ తేదీలోగా చేసుకోవాలని సూచించారు. వరికి ఎకరాకు రూ.630 చెల్లిస్తే బీమాగా రూ.42,000 వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏవో త్రినాథ్, ఏఐసీ కో ఆర్డినేటర్ వెంకట గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ మోహన్ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: మండలంలో వరి పంట పొట్ట దశలో ఉందని, రైతులంతా తెగుళ్ల నివారణపై అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహనరావు సూచించారు. మంగళవారం యలమంచిలి మండలం తెరువుపల్లి, కట్టుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. తుపాను, భారీ వర్షాల సమయంలో వరి పంటను కాపాడుకునేందుకు అవసరమైన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొట్ట, పూత దశల్లో ఉన్నప్పుడు పైరు రెండ్రోజుల కంటె ఎక్కువ సమయం నీటిలో ఉంటే కంకులు బయటకు రావని, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్పారు. తెగుళ్ల విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్, వ్యవసాయ సహాయకులు బ్లేసీ, దివ్య, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం దిమిలి, పంచదార్ల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు వరిలో ఆశించిన తెగుళ్లపై వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం, మండల వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో వరి పంటను ఆశించిన మానిపండు తెగులు నివారణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.వి.చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి సుమంత, మేఘన పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు

పాయకరావుపేట: పట్టణంలోని గవర్నమెంట్ ఐటీఐ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో ఉచితంగా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఎన్.గోవిందరావు తెలిపారు. పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగి 18–35 పంవత్సరాల లోపు వయస్సు ఉన్న స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులని పేర్కొన్నాడు. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, 2 పాస్ ఫొటోలతో ఐటీఐలో పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం స్కిల్ హబ్ సెంటర్ కో ఆర్డినేటర్ కె.నరేంద్ర 96401 38565 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సాగులో ఉన్నవారికే డీఫారం భూముల అప్పగింత



కాకరాపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో ఆయిషా

మునగపాక: సాగులో ఎవరైతే ఉన్నారో వారందరికి సర్వే చేయించి భూములను అప్పగించాలని అనకాపల్లి ఆర్డీవో ఆయిషా ఆదేశించారు. మండలంలోని కాకరాపల్లి, పాటిపల్లి రెవెన్యూ పరిధిలోని డీ ఫారం భూములను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డీ–ఫారం పట్టాలు పొంది ఎంత మంది సాగులో ఉన్నారో వారికి సంబంధిత భూములను అప్పగించాలని సూచించారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండా చూడాలన్నారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు, వీఆర్వో సత్యనారాయణ, పెద్దలు నాగిరెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాయకరావుపేట డివిజన్:
9951602901
Office mail : sakshiadvtvsp@gmail.com